క్లుప్తంగా

తాటిచెట్టుపై నుంచి పడిన గీత కార్మికుడు

తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు

కొముురవెల్లి(సిద్దిపేట): ప్రమాదవశాత్తు తాడి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చిట్యాలలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొట్టిపర్తి నర్సయ్య వృత్తిలో భాగంగా రోజూ మాదిరిగానే తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని సిద్దిపే ట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

మర్కూక్(గజ్వేల్): పేద కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పట్నం సాయికుమార్ ఆరు నెలల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా.. అతని భార్య, పిల్లలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రూ.15 వేల ఆర్థిక సాయం, నిత్యావసరాలను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు తులసీదాస్, సభ్యులు కిరణ్, ఆనంద్, సంతోష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు

మర్కూక్(గజ్వేల్): బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మర్కూక్‌లోని పలు పార్టీల యువకులు ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కమలం వైపు చూస్తున్నారన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపునకు సైనికులా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, వెంకట్, కరుణాకర్, వంశీ, మహేష్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొముురవెల్లి మల్లన్నకు రూ.లక్ష విరాళం



ఆలయ చైర్మన్‌కు చెక్కు అందిస్తున్న చంద్రారెడ్డి

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌కు చెందిన చంద్రారెడ్డి మనమడు భావిక్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం కొముురవెల్లి మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే జన్మదినాన్ని నిర్వహించారు. కాగా మల్లన్న ఆలయానికి రూ. లక్ష 116 ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డికి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, ఏటా పుట్టిన రోజునాడు మల్లన్న ఆలయానికి రూ.లక్ష 116లు విరాళంగా ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కనకయ్య పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



మద్దూరు : సెల్‌ఫోన్ అప్పగిస్తున్న పోలీస్ అధికారి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన అందే మహేందర్‌కు పోలీసులు సెల్‌ఫోన్ అప్పగించారు. అతను జనవరిలో పోగొట్టుకున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఆదివారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడారు. మండలంలో ఎవరిదైనా సెల్‌ఫోన్ పోయినట్లయితే తమకు ఫిర్యాదు ఇవ్వాలన్నారు.

దుబ్బాకరూరల్: వెంకటపూర్‌కె గ్రామానికి చెందిన వెంకటస్వామికి తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం ఎస్ఐ రవికాంత్‌రావు అప్పగించారు. కొన్ని రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను అక్బర్‌పేటభూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో బాధితుడు పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అందజేశారు.

మంచిని ఆచరించాలి

తొగుట(దుబ్బాక): చెడును వదిలేసి మంచిని ఆచరించడమే మహావీర్ ఆశయమని విశ్వహిందూ పరిషత్ ప్రాంత సామాజిక సమరసత ప్రముఖ్ ధనుంజయ అన్నారు. మండల పరిధిలోని లింగంపేటలో జై శ్రీరామ్ విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మహావీర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువులో ప్రాణిని చూడటం వల్ల జైన మతం అప్పట్లో మంచి ప్రాచుర్యం పొందిందన్నారు. జైన మతం బౌద్ధం కంటే ప్రాచీనమైందన్నారు. కార్యక్రమంలో సమరసత సభ్యులున్నారు.

‘గుట్ట’కాయ స్వాహా



ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపు

- యంత్రాలతో మట్టి తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా

హుస్నాబాద్: ప్రకృతి సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. చరిత్రకు అద్దం పట్టే గుట్టలను మింగేస్తున్నారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి సమీపంలోని గుట్టను జేసీబీల సహాయంతో తవ్వి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల నుంచి అనుమతి తీసుకున్న దాఖలాలు లేవు. కాగా ఆదివారం సెలవు రోజు కావడం పైగా అధికారులు అందుబాటులో ఉండరు. ఈ సమయాన్ని ఎంచుకొని యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లకు ఈ మట్టినే తోలుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులను గుట్టలను కాపాడాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హుస్నాబాద్‌లో జేసీబీ సహాయంతో గుట్టలను తవ్వుతున్న అక్రమార్కులు

పశుగ్రాసం కొరత



కొనుగోలు చేసిన గడ్డిని తరలిస్తున్న రైతులు

మేత లేక మూగజీవుల అరణ్యరోదన

ఆందోళనలో పశుపోషకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈ యాసంగి సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం తగ్గగా పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. వ్యవసాయంలో యాంత్రీకరణ కూడా కారణమని చెప్పొచ్చు. దీంతో మండలంలో మూగజీవాల పోషణ భారంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలవ్యాప్తంగా ఆవులు, గేదెలు 35 వేలకు పైగా ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. చాలామంది రైతులు పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈసారి వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండక పశుగ్రాసానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడ్డి లేక పశువులు అల్లాడుతుంటే రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇతర ప్రాంతాల్లో కొని..

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ యాసంగిలో వరి సాగు తగ్గింది. ఇదిలా ఉంటే పంటకోతల సమయంలో కూలీల కొరత కారణంగా యంత్రాల వినియోగం పెరిగింది. తద్వారా పశుగ్రాసం ఎందుకూ పనికి రాకుండా పోయింది. దాంతో కొరత తలెత్తింది. ఇప్పుడు ఎండల తీవ్రత వల్ల ఎక్కడా కూడా గడ్డి పోచ మొలవట్లేదు. దీంతో రోజువారీగా పొలాలకు వెళ్లిన పశువులకు మేత దొరకక అలమటిస్తూ ఇంటి దారి పడుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ. 10 నుంచి 15 వేల వరకు చెల్లించి కొంటున్నారు. ఎక్కడైనా గడ్డి ఉందనే సమాచారం తెలిస్తే చాలు కష్టాలకోర్చి కొని తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉచితంగా పశుగ్రాసం అందించాలని, దాహార్తిని సైతం తీర్చేందుకు తొట్లకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే గ్రాసం అందించాలి



మూగ జీవాలకు రోజు రోజుకూ పశుగ్రాసం దొరకకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు ప్రభుత్వం ఉచితంగా పశు గ్రాసం సరఫరా చేయాలి. పశువులను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారులు రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి.

– రాజారెడ్డి, రైతు మాచాపూర్

పోచమ్మ.. చల్లంగా చూడమ్మా..



చిలాపూర్‌లో పోచమ్మ బోనాలతో ఆలయానికి తరలి వెళ్తున్న మహిళలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరులో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగే సిద్దోగం వేడుకల్లో భాగంగా గ్రామ దేవత అయిన అమ్మకు ముందుగా బోనాలు నిర్వహించడం ఆనవాయితీ అని సంఘం సభ్యులు తెలిపారు. అలాగే చిలాపూర్ ఎస్సీ కాలనీవాసులు కూడా పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించారు. ఆపై మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వారు కోరుకున్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు



వీరాంజనేయ నాభిశిల ప్రతిష్ఠ మహోత్సవాలు

మాధవానంద సరస్వతీ స్వామి

నర్సాపూర్ రూరల్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు అని మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో ఆదివారం వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ, నాభిశిల మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వీరాంజనేయ శివ పంచాయతన సహిత నాభిశిల ప్రతిష్ఠ మాధవానంద స్వామి పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు దారి చూపుతాయన్నారు. అందరూ భక్తి భావన కలిగి భగవంతుని పూజించాలన్నారు. ఈ కార్యక్రమాలకు సహకరించిన దాత జీవక ఇండస్ట్రీస్ యజమాని మోహన్ లాల్ అగర్వాల్ కుటుంబం ప్లాంట్ ఇన్‌చార్జి హరీశ్‌ను గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్, నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, గ్రామ మాజీ సర్పంచ్ కరుణాకర్, ఎంపీటీసీ శోభా విజయ్ కుమార్, నరసింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జగన్, జనార్దన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ సభ్యులు రవి యాదవ్, రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

సిద్దిపేటకమాన్: హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్‌దళ్ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న పట్టణంలో నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్ర, బైక్ ర్యాలీకి తరలిరావాలని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు రంగదాంపల్లి హనుమాన్ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతోందన్నారు. ఈ ర్యాలీ పట్టణ పురవీధుల మీదుగా రూరల్ పోలీసు స్టేషన్ చౌరస్తా దాసాంజనేయ ఆలయం వరకు కొనసాగుతోందన్నారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాజారాం, మురళి, శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నన్ను ఆదుకోరూ...

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాను
- వైద్యం కోసం రూ.3.10 లక్షలు ఖర్చు చేశానన్న బాధితుడు సత్యనారాయణ



సత్యనారాయణ దంపతులు

బెజ్జంకి(సిద్దిపేట): కోతులు అడ్డురావడంతో బైక్ నుంచి పడి తీవ్రంగా గాయపడ్డానని, వైద్యం కోసం ఇప్పటికే రూ.3.10 లక్షలు ఖర్చు చేశానని, తనను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని దాచారం గ్రామానికి చెందిన బండిపెల్లి సత్యనారాయణ కోరుతున్నారు. ఈనెల 3న తాను తన భార్య స్వప్నతోపాటు శోభ అనే మహిళతో కలిసి కర్రోనికుంటలో ఉపాధి పనుల కోసం బయలుదేరామన్నారు. తాము ప్రయాణిస్తున్న వాహనానికి కోతులు అడ్డు రావడంతో బైక్ ఆపే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డామన్నారు. దీంతో తనకు కాలు కాలు ఫ్యాక్చరైందని, స్వప్నకు ముఖంపై తీవ్రగాయాలు కాగా శోభ స్వల్పంగా గాయపడిందన్నారు. తనను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని, పరీక్షించిన వైద్యులు కాలికి ఆపరేషన్ చేశారన్నారు. మొత్తంగా రూ.3.10 లక్షలు ఖర్చులయ్యాయని, అప్పులు తెచ్చి మరి వైద్యం చేయించుకున్నానని తెలిపారు. అయితే ఈజీఎస్ అధికారులు కనీసం సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా చికిత్సకు అయినా డబ్బులు ఇప్పించాలని అధికారులను కోరారు.

సివిల్స్‌లో సత్తాచాటిన అఖిల్‌కు సన్మానం



అఖిల్ యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రానికి చెందిన బుద్ధి అఖిల్ యాదవ్ సివిల్స్‌లో ప్రతిభ చూపాడు. కాగా ఆదివారం గ్రామానికి చేరుకున్న అతనిని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాక పేరు ప్రతిష్టలను దేశ వ్యాప్తంగా వ్యాపింపజేశాడన్నారు. అతను ఇదివరకే ఐపీఎస్ అర్హత సాధించాడన్నారు. అయితే ఐఏఎస్ కావాలని లక్ష్యం పెట్టుకున్నాడని తెలిపారు. దీని కోసం పట్టుదలతో రెండు మార్లు పరీక్షలు రాసి ఐఏఎస్ సాధించడం సాధారణ విషయం కాదన్నారు. కొడుకు అభ్యున్నతికి పాటుపడిన తల్లిదండ్రులను అభినందించారు. మారబోయిన పర్శరాంలు, బుద్ధి నరేష్, కుంచెం రవి, భాను, కిషన్, పవన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తిభావం పెరగాలి



దౌలాపూర్‌లో పూజలు చేస్తున్న ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఒక్కో గ్రామ దేవతకు ఒక్కో చరిత్ర ఉంటుందని ఎస్‌డీఎఫ్ మాజీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాత్సవాల్లో భాగంగా ఆదివారం దౌలాపూర్‌లో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ, ఎల్లమ్మ, సొడాలమ్మ, మహంకాళమ్మ, మహాలింగేశ్వర దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులు.. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా ప్రతాప్‌రెడ్డి హాజరై అమ్మవార్లకు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావాన్ని అందరూ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, పండితులు శ్రీనివాస్‌శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఉప్పల్‌రెడ్డి, పుల్లయ్య, సాయిలు, జయమ్మ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇనుప సామగ్రి చోరీ

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన స్థానికులు

గజ్వేల్‌రూరల్: ఇనుప సామగ్రిని చోరీ చేసిన దొంగను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(బ్రాహ్మణ బంజేరుపల్లి)లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణ బంజేరుపల్లిలో హనుమాన్ దేవాలయం వద్ద గల ఇనుప సామగ్రిని చోరీ చేసి.. టీవీఎస్ ఎక్సెల్‌పై తూర్పాటి వంశీ తీసుకొని వెళ్తుండగా గుర్తించిన స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుడు ఐలయ్య ఫిర్యాదు చేశారు.

వైభవంగా రథోత్సవం



దాచారంలో రథం ఊరేగింపులో భక్తులు

కోహెడ(హుస్నాబాద్): సీతారామచంద్రస్వామి వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రథానికి పూజారులు పూజలు చేయగా ముందుకు కదిలింది. ప్రధాన రహదారి గుండా ఊరేగింపు సాగి చివరికి ఆలయం వద్దకు చేరుకుంది. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారంలో సీతారాముల బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అలాగే బెజ్జంకి, శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని సింహవాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లోకి చేరికలు

కొముురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కొముురవెల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, మద్దూరు జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పుట్ట మల్లేశం, ఈగ కనకయ్య, కంకణాల చంద్రం, సిద్దులు, ఎల కనకయ్య తదితరులు ఉన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్‌లోకి పుల్లూరు మాజీ ఎంపీటీసీ సంతోషి చేరారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ.. సంతోషికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలీమొద్దీన్, మార్క సతీష్‌గౌడ్, గరిపల్లి రాములు, పుల్లూరు కనకయ్య, శంకర్, జనార్దన్, పుల్లూరు నాయకులు పాల్గొన్నారు.

◆ ఘనంగా గ్రామ దేవతలకు పూజలు

గజ్వేల్‌రూరల్: అమ్మవార్ల ఆశీస్సులతో సంతోషంగా ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోగల ప్రజ్ఞాపూర్‌లోని నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం భక్తులు విశేష సంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చారు. అలాగే మండల పరిధిలోని అనంతరావుపల్లిలో నాభిశిల, దుర్గామాత, ఎల్లమ్మ, మహంకాళి అమ్మవారు, మత్తడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడురోజుల నుంచి నిర్వహిస్తున్నారు. ఆదివారం భక్తులు, గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమాల్లో ప్రజలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

◆ భువనగిరికి కాంగ్రెస్ శ్రేణులు

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి నామినేషన్ ఆదివారం దాఖలు చేయనున్న నేపథ్యంలో చేర్యాల, కొముురవెల్లి మండలాల నుంచి వాహనాలలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా తరలి వెళ్లారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. కొముురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, మల్లన్న ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, మేర్గు శ్రీనివాస్, మంచాల చిరంజీవులు, దాసరి కళావతి తదితరులు ఉన్నారు.

◆ కానిస్టేబుల్ రక్తదానం

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాపకు రక్తం అవసరం కాగా విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన ఓ పాప అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. అత్యవసరంగా రక్తం అవసరమన్న విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తిరుపతి వెంటనే స్పందించారు. వెంటనే బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి ఆదివారం రక్తదానం చేశారు.

◆ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

జహీరాబాద్ టౌన్: అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని హైదరాబాద్ మౌలానా అజాత్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ ప్రొఫెసర్ సిద్దిఖీ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నైపుణాల పెంపుపై సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులు అనేక సవాళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు సమకాలీన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు.